సాక్షి
తిరుపతి
ఆదివారం । 28 । మే । 2023



చిన్నశేషుడిపై గోవిందుడి రాజసం

శ్రీగోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు చిన్నశేష వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. - 8లో



నూతన సబ్ డివిజన్ల ఏర్పాటు

పరిపాలనా సౌలభ్యం, శాంతిభద్రతల పరిరక్షణ కోసం తిరుపతి జిల్లాలో పలు మార్పులు చేసినట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	40	28
చిత్తూరు	39	27
తిరుమల	35	23
గూడూరు	42	23
నగరి	41	28

న్యూస్‌రీల్

నేడు యూపీఎస్సీ పరీక్షలకు ప్రత్యేక బస్సులు

తిరుపతి అర్బన్: తిరుపతిలో ఆదివారం నిర్వహించనున్న యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) పరీక్షలకు తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి అవసరమైన బస్సులను ఏర్పాటు చేసినట్టు జిల్లా ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతిలో 13 సెంటర్లలో పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఈ పరీక్షలకు 6,333 మంది హాజరు కానున్నట్టు వెల్లడించారు. ఆ మేరకు సెంట్రల్ బస్టాండ్ నుంచి సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 7గంటల వరకు సర్వీసులు నడుస్తాయని ఆయన స్పష్టం చేశారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ టీబీసీ వద్దకు చేరింది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 79,486 మంది స్వామివారిని దర్శించుకోగా.. 40,250 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.72 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: బిందు సేద్య పరికరాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సూక్ష్మసేద్య అధికారి సతీష్ తెలిపారు. ఆసక్తి గల రైతులు ఈనెల 31వ తేదీలోపు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 7995009490 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

513 అక్రిడిటేషన్ల మంజూరు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: జిల్లాలో అర్హత కలిగిన మీడియా ప్రతినిధులకు 2023, 2024 రెండేళ్ల కాల పరిమితితో 513 మందికి అక్రిడిటేషన్లను మంజూరు చేసినట్టు కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కె వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం ఉదయం కలెక్టరేట్‌లో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ తొలి సమావేశం జరిగింది. నిబంధనల మేరకు అర్హత కలిగిన పాత్రికేయులకు అక్రిడిటేషన్లు ఇవ్వాలని నిర్ణయించినట్టు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడతలో 513 మందికి అక్రిడిటేషన్లు మంజూరు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో జర్నలిస్ట్ బస్ పాస్ చెల్లేవిధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో కమిటీ కన్వీనర్, డీఐపీఆర్ఓ బాలకొండయ్య, కమిటీ సభ్యులు రవిరెడ్డి, డా.ప్రదీప్‌కుమార్, మునికృష్ణయ్య, కార్తీక్, లావణ్యకుమార్, అసిస్టెంట్ కమిషనర్ లేబర్ డిపార్ట్‌మెంట్ కృష్ణారెడ్డి, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ శివకుమార్, రైల్వే చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ శ్రీకాంత్, ఆర్టీసీ ఏఎంటీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉద్యోగోన్నతి ప్రక్రియ

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్ కేడర్‌కు ఉద్యోగోన్నతి ప్రక్రియ నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ ప్రక్రియ శనివారంతో ముగిసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని సర్కారు బడుల్లో పనిచేస్తున్న 217 మంది సీనియర్ ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ ప్రక్రియను డీఈవో విజయేంద్రరావు పర్యవేక్షించారు. ఉమ్మడి చిత్తూరు పరిధిలో పలువురు టీచర్లు, సంఘ నాయకులు ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు.

నేడే కౌంట్‌డౌన్

1 DAY TO GO



షార్‌లోని రెండో ప్రయోగవేదికపై నింగికి ఎక్కుపెట్టిన బాణంలా విద్యుత్ దీపాల కాంతిలో మెరుస్తున్న జీఎస్ఎల్వీ ఎఫ్12 ఉపగ్రహ వాహకనౌక

- ఉదయం 7.12 గంటలకు కౌంట్‌డౌన్ ఆరంభం
- రేపు ఉదయం 10.42 గంటలకు జీఎస్ఎల్వీ ఎఫ్12 ప్రయోగం
- ఎంఆర్ఆర్, ల్యాబ్ సమావేశాల్లో శాస్త్రవేత్తల నిర్ణయం

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) షార్ కేంద్రంలోని రెండో ప్రయోగవేదిక నుంచి సోమవారం ఉదయం 10.42 గంటలకు ప్రయోగించనున్న జీఎస్ఎల్వీ ఎఫ్12 రాకెట్‌కు ఆదివారం ఉదయం 7.12 గంటలకు కౌంట్‌డౌన్ ఆరంభించనున్నారు. శనివారం షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాల్‌లో మిషన్ రెడీనెస్ రివ్యూ (ఎంఆర్ఆర్) సమావేశాన్ని నిర్వహించిన తర్వాత ప్రయోగ పనులను లాంచ్‌ఆథరైజేషన్ బోర్డు (ల్యాబ్) వారికి అప్పగించారు. లాంచ్‌ఆథరైజేషన్ బోర్డు చైర్మన్ ఆర్ముగం రాజరాజన్ ఆధ్వర్యంలో మరోమారు ల్యాబ్ సమావేశం నిర్వహించారు. ల్యాబ్ సమావేశానికి ముందు జీఎస్ఎల్వీ ఎఫ్12 రాకెట్‌కు సంబంధించి లాంచ్ రిహార్సల్స్, తర్వాత ఎంఆర్ఆర్ సమావేశం, ల్యాబ్ సమావేశం నిర్వహించిన అనంతరం కౌంట్‌డౌన్ సమయాన్ని, ప్రయోగ సమయాన్ని అధికారికంగా ప్రకటించారు. 27.30 గంటల కౌంట్‌డౌన్ సమయంలో రాకెట్‌లోని రెండో దశలో ద్రవ ఇంధనాన్ని నింపే ప్రక్రియను ఆదివారం కౌంట్‌డౌన్ ప్రారంభమైన వెంటనే చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం రాకెట్‌కు అవసరమైన హీలియం, నైట్రోజన్ గ్యాస్‌లు నింపడం, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వ్యవస్థలను అప్రమత్తం చేసే ప్రక్రియను చేపట్టనున్నారు. 27.30 గంటల కౌంట్‌డౌన్ అనంతరం సోమవారం ఉదయం 10.42 గంటలకు 2,232 కిలోల బరువు కలిగిన నావిక్–01 ఉపగ్రహాన్ని మోసుకుని భూమికి దగ్గరగా 173 కిలోమీటర్లు (పెరిజీ), భూమికి దూరంగా 36,568 కిలోమీటర్లు (అపోజీ) జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (భూబదిలీ కక్ష్య) దీర్ఘవృత్తాకార కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. అనంతరం బెంగళూరు సమీపంలోని హాసన్‌లో ఉన్న గ్రౌండ్‌స్టేషన్ నుంచి ఉపగ్రహంలో నింపిన ఇంధనం సాయంతో మూడు దశల్లో పెరిజీని పెంచుతూ అపోజీని తగ్గిస్తూ భూమికి 36 వేల కిలోమీటర్లు ఎత్తులోని జియో ఆర్బిట్‌లో ఉపగ్రహాన్ని స్థిరపరుస్తారు. షార్ కేంద్రం నుంచి 87వ ప్రయోగం. జీఎస్ఎల్వీ మార్క్–2 సిరీస్‌లో 15వ ప్రయోగం. పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో క్రయోజనిక్ ఇంజిన్లు తయారు చేసుకుని చేస్తున్న 9వ ప్రయోగం కావడం విశేషం.

- ▸▸ రాకెట్ పొడవు 51.70 మీటర్లు, 420 టన్నుల బరువు
- ▸▸ 51.70 మీటర్ల పొడవున్న జీఎస్ఎల్వీ రాకెట్ భూమి నుంచి నింగికేగే సమయంలో 420 టన్నుల బరువు ఉంటుంది.
- ▸▸ నాలుగు స్ట్రాపాన్ బూస్టర్ల సాయంతో మొదటి దశ ప్రారంభమవుతుంది. ఒక్కో స్ట్రాపాన్ బూస్టర్‌లో 42.675 టన్నుల ద్రవ ఇంధనం నింపుతారు. నాలుగు స్ట్రాపాన్ బూస్టర్లలో కలిపి 170.688 టన్నుల ద్రవఇంధనంతో పాటు కోర్ అలోన్‌దశలో 138.102 ఘన ఇంధనంతో మొదటి దశను 151 సెకండ్లలో పూర్తవుతుంది.
- ▸▸ 420 టన్నులు బరువును భూమి నుంచి తీసుకెళ్లాలి కాబట్టి మొదటి దశలో నాలుగు స్ట్రాపాన్‌బూస్టర్లతో పాటు కోర్‌అలోన్‌దశతో కలిపి 308.790 టన్నుల ద్రవ, ఘనఇంధనంతో కలగలిపి మొదటి దశను నిర్వహించనున్నారు.
- ▸▸ 42 టన్నుల ద్రవ ఇంధనం సాయంతో రెండో దశను 294 సెకెండ్లకు పూర్తవుతుంది.
- ▸▸ ఆ తర్వాత అత్యంత కీలక దశ అయిన క్రయోజనిక్ దశలో 14.420 టన్నుల క్రయోజనిక్ ఇంధనం సాయంతో 1110 సెకెండ్లకు మూడోదశను కటాఫ్ చేస్తారు.
- ▸▸ ఆ తర్వాత జీఎస్ఎల్వీ ఎఫ్12 ఉపగ్రహ వాహకనౌక ద్వారా 2,242 కిలోల బరువు కలిగిన నావిక్–01 ఉపగ్రహాన్ని మోసుకెళ్లి 1,120 సెకెండ్లకు (18.40 నిమిషాలు) 173 కిలో మీటర్లు పెరిజీ (భూమికి అతి దగ్గరగా), 36,568 కిలో మీటర్లు అపోజి (భూమికి దూరంగా) జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టనున్నారు.
- ▸▸ అక్కడి నుంచి ఉపగ్రహాన్ని బెంగళూరుకు సమీపంలోని హసన్‌లో ఉన్న మాస్టర్ కంట్రోల్ సెంటర్ వారు వారి అధీనంలోకి తీసుకుని ఉపగ్రహంలో నింపిన 1,250 కిలోల ఇంధనాన్ని దశల వారీగా మండించి భూమికి 36 వేల కిలోమీటర్లు ఎత్తులోని భూస్థిర కక్ష్యలో ప్రవేశపెట్టే పనిని పూర్తిచేసే విధంగా ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగాన్ని డిజైన్ చేశారు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి (ఇన్‌సెట్) సోమలలో జరిగిన సభకు హాజరైన రైతులు, ప్రజలు





ప్రాజెక్టులు నిర్మిస్తాం.. సస్యశ్యామలం చేస్తాం

'ఈ ప్రాజెక్టులు పూర్తయితే పడమటి నియోజకవర్గాలు సస్యశ్యామలం అవుతాయి. ప్రజలకు తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుంది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మంచి పేరు వస్తుంది. ఈ వాస్తవాలన్నీ తెలుసుకున్న చంద్రబాబు కేసుల పేరుతో అడ్డుతగిలారు. ఎందుకంటే అభివృద్ధిని అడ్డుకోవడమే ఆయన నైజం. చంద్రబాబు హయాంలో అభివృద్ధి చేయలేదు. ఇప్పుడు ఎవరూ చేయకూడదన్న దురుద్దేశంతోనే మూడు ప్రాజెక్టులను అడ్డుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. కానీ అవేవీ ఫలించబోవు. న్యాయం మన వైపే ఉంది. ఇక్కడ ప్రాజెక్టులను నిర్మిస్తాం..ఈ ప్రాంతాన్ని సుభిక్షంగా మారుస్తాం.'
– పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎమ్మెల్యే, తంబళ్లపల్లె

- చంద్రబాబు అభివృద్ధి చేయడు.. చేయనివ్వడు
- 7 వేల ఎకరాలు కబ్జా చేసింది టీడీపీ నేతలే
- కుప్పంలో బాబు దోపిడీ రూ.300 కోట్లు
- ధ్వజమెత్తిన ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి



సోమల మండలం ఆవులపల్లెలో నిర్మిస్తున్న ప్రాజెక్టు

పుంగనూరు: పడమటి నియోజకవర్గాలకు సాగు–తాగునీరు అందించడం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ముదివేడు, నేతిగుట్లపల్లె, ఆవులపల్లె ప్రాజెక్టులపై చంద్రబాబునాయుడు తప్పుడు కేసులు వేసి అడ్డుకోవడంపై తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమల మండలం ఆవులపల్లె ప్రాజెక్టు వద్ద సాధన సమితి ఆధ్వర్యంలో శనివారం రైతుల సదస్సు నిర్వహించారు. దీనికి చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, టీటీడీ బోర్డు మెంబరు పోకల అశోక్‌కుమార్, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, రెడ్డెప్ప హాజరయ్యారు.

చంద్రగిరిలో ఓడిపోయి.. కుప్పం పారిపోయి

ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్‌టీఆర్‌ను చంపి టీడీపీని లాక్కున్న చంద్రబాబునాయుడు దమ్ముంటే కొత్త పార్టీ పెట్టి గెలవాలని సవాల్ విసిరారు. ఆయన సీఎంగా ఉన్న 14 ఏళ్లలో కుప్పానికి కానీ, చిత్తూరు జిల్లాకు కానీ ఏమి చేయలేదని గుర్తుచేశారు కుప్పంలో రూ.140 కోట్లతో నిర్మించాల్సిన ప్రాజెక్టుకు రూ.440 కోట్లు ఖర్చు చేసి రూ.300 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. చంద్రగిరిలో ఓడిపోయి కుప్పంకు పారిపోయాడని ఎద్దేవా చేశారు. కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రాజెక్టులపై కోర్టులకు వెళ్లినా తగిన సాక్ష్యాధారాలతో గెలుస్తామని, న్యాయం తమ వైపే ఉందని ధీమా వ్యక్తం చేశారు. సోమల మండలంలో 7 వేల ఎకరాలు అటవీ భూమిని టీడీపీ నేతలు కబ్జా చేశారని ఆరోపించారు. సీతమ్మ చెరువులో ప్రాజెక్టు నిర్మించి తీరుతామని, దీని ద్వారా పీలేరు, రొంపిచెర్ల, పులిచెర్ల, సదుం, సోమల మండలాలకు తాగునీరు–సాగునీరు అందిస్తామని తెలిపారు. "తెలుగుదేశం ప్రభుత్వంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమమైనా జరిగిందా? ఉంటే రండి బహిరంగంగా చర్చిద్దాం." అని ఎమ్మెల్యే సవాల్ విసిరారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ఏకిల సంఘం అధ్యక్షుడు మురళీధర్, ఎంపీపీలు సురేంద్రరెడ్డి, ఈశ్వరయ్య, గాజుల రామ్మూర్తి, జెడ్పీటీసీలు సోమశేఖర్‌రెడ్డి, దామోదర్‌రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డీశ్వరరెడ్డి, పృద్వీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇది భగీరథ యత్నమే



పడమటి నియోజకవర్గాలకు అవసరమైన తాగునీరు–సాగునీరు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సుమారు రూ.2,300 కోట్లతో మూడు ప్రాజెక్టుల నిర్మాణం కోసం భగీరథ యత్నం చేపట్టారని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప కొనియాడారు. గతంలో మనం జమీందారులు నిర్మించిన చెరువులు మాత్రమే చూస్తున్నామన్నారు. కానీ మంత్రి పెద్దిరెడ్డి సుమారు 6.5 టీఎంసీల నీటిని నిల్వ చేసే మూడు ప్రాజెక్టులను నిర్మిస్తుంటే అడ్డుకోవడం, తప్పుడు కేసులు వేయడం శోచనీయమన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రతి ఒక్కరికి తగిన పరిహారం అందిస్తామని స్పష్టం చేశారు. సుమారు 10 వేల ఎకరాలకు సాగునీరందించే ప్రాజెక్టు నిర్మిస్తుంటే టీడీపీ ఏ రకంగా అడ్డుకుంటుందో ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని మట్టి కరిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రాజెక్టులపై సమావేశం జరుగుతుండగా టీడీపీ నాయకులు ప్రాజెక్టు స్థలాల్లో హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించడంపై ఎంపీ రెడ్డెప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు ఏరియల్ సర్వేల కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తూ, ప్రాజెక్టులను అడ్డుకోవడం ప్రజలు గమనించాలని సూచించారు. హెలిక్యాప్టర్‌లో కాకపోతే నేరుగానే వచ్చి సర్వే చేసుకోవచ్చు. ఇక్కడ ఎవరికీ అన్యాయం జరగడం లేదు అన్న మాటలతో ప్రజలు, రైతులు నినాదాలతో హర్షం వ్యక్తం చేశారు.

అభివృద్ధి నిరోధకుడు చంద్రబాబు



ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని చూసి సహించలేక అడ్డుకునే ప్రయత్నాలు చంద్రబాబునాయుడు చేయడం శోచనీయమని టీటీడీ బోర్డు మెంబరు పోకల అశోక్‌కుమార్ అన్నారు. చంద్రబాబు పాలనలో కరువు కాటకాలతో ప్రజలు తల్లడిల్లిపోయారని తెలిపారు. జగన్ పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని కొనియాడారు.


రేషన్‌లో ఐరిష్ విధానం



ఐరిష్ పరికరాలు పంపిణీ చేస్తున్న డీఆర్వో

తిరుపతి అర్బన్: రేషన్‌లో వేలిముద్రలు సక్రమంగా పడనివారికి ఐరిష్ విధానం ద్వారా బియ్యం పంపిణీ చేయనున్నట్లు డీఆర్వో ఎం.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో శనివారం ఐరిష్ పరికరాలను ఎండీయూ వాహనదారులకు పంపిణీ చేశారు. అనంతరం డీఆర్వో మాట్లాడుతూ ఇంటింటికీ రేషన్ పంపిణీ వ్యవస్థలో వృద్ధులు, పిల్లల వేలిముద్రలు సరిగా పడని కారణంగా ఆ ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లామని, దీంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి బయోమెట్రిక్ విధానమే కాకుండా ఐరిష్ విధానంలో కూడా రేషన్ పంపిణీ చేసే విధంగా ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శేషాచలరాజు, సీఎస్‌డీటీ జయరాజు, ఎండీయూ రాష్ట్ర అధ్యక్షుడు కిషోర్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు రమేష్‌రెడ్డి, కిషోర్, మురళి, ఖాదర్ , టెక్నీషియన్లు వీరేంద్ర కిషోర్ పాల్గొన్నారు.

గాలీవాన బీభత్సం



గుడిమల్లం వృద్ధాశ్రమంపై పడిన చెట్టు

ఏర్పేడు: మండలంలో శనివారం సాయంత్రం గాలీవాన బీభత్సం సృష్టించింది. వికృతమాల టీసీఎల్ కర్మాగారం వద్ద ఓ హోటల్‌కు ఏర్పాటు చేసిన సిమెంట్ రేకులు లేచిపోయాయి. వాటి విలువ రూ.3 లక్షలు ఉంటుందని బాధితులు వాపోయారు. గుడిమల్లం వృద్ధాశ్రమంపై చెట్టు కూలింది. ఎలాంటి నష్టం సంభవించలేదు. మర్రిమందలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై చెట్టు కూలడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. వికృతమాల, గుడిమల్లం, పెనుమల్లం, పెన్నగడం, చెల్లూరు తదితర గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు నేలకూలాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పాడింది.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

తిరుపతి తుడా: రాష్ట్ర ప్రభుత్వం ద్వారా హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలందరికీ వ్యాక్సినేషన్ తప్పనిసరి అని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి పేర్కొన్నారు. తిరుపతి కేంద్రంగా వెళ్లే హజ్ యాత్రికులకు శనివారం స్థానిక షాదీ మహల్‌లో వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. హజ్ యాత్రికుల్లో మూడేళ్లపైబడి ఉండిన వారందరూ వ్యాక్సిన్ వేసుకోవాలని సూచించారు.



వ్యాక్సిన్ వేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి

కొండపై వెన్నెల!

తిరుమల శ్రీవారిని శనివారం ప్రముఖ సినీనటి కీర్తి సురేష్ దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా.. అధికారులు లడ్డూ ప్రసాదాలు పంపిణీ చేశారు.

– తిరుమల



క్లుప్తంగా

గుర్తుతెలియని వాహనం ఢీకొని లారీ డ్రైవర్ మృతి


మృతి చెందిన లారీ డ్రైవర్ విశ్వనాథ్

చిల్లకూరు: రోడ్డు దాటుతున్న లారీ డ్రైవర్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చిల్లకూరు వరగలి క్రాస్ రోడ్డు పరిధిలో శనివారం వేకువజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గుంటూరు జిల్లా, చిలకలూరిపేటకు చెందిన విశ్వనాథ్(35), మార్టురుకు చెందిన గోపి మార్టురు నుంచి గ్రానైట్ తీసుకుని లారీలో తిరుపతి వెళ్లి లోడ్డు దించి తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో శనివారం వేకువజామున వరగలి క్రాస్ రోడ్డు ప్రాంతంలోకి వచ్చే సరికే విశ్వనాథ్ లారీని పక్కన ఆపి బహిర్భూమికని నాయుడుపేట వైపు వాహనాలు వెళ్లే రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చిన్నశేషుడిపై గోవిందుడి రాజసం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామివారు చిన్నశేష వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం స్వామి వారి వాహన సేవ వేడుకగా సాగింది. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజ స్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనాలతో విశేషంగా అభిషేకం చేశారు. కాగా రాత్రి 7 నుంచి 9 గంటల వరకు హంస వాహనంపై స్వామి వారు ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. కళాప్రదర్శనల నడుమ స్వామివారి హంస వాహన దారుడై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, కంకణభట్టార్ ఏపీ.శ్రీనివాస దీక్షితులు, డెప్యూటీ ఈవో శాంతి, ఏఈవో రవికుమార్, సూపరింటెండెంట్ నారాయణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఏఈల జీతాల నుంచి రికవరీ

- ఉమ్మడి జిల్లాలో 40 మందికి నోటీసులు
- 24,106 వర్క్‌ఆర్డర్లు పెండింగ్
- మే నెల నుంచి జీతాలు కట్



చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లా ట్రాన్స్‌కో పరిధిలో వర్క్‌ఆర్డర్లు క్లోజ్ చేయని ఏఈల జీతాల నుంచి ఆ మొత్తం రికవరీ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లాలో 2018–19వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకు 40 మంది ఏఈల పరిధిలో రూ.160 కోట్లు విలువ చేసే 21,060 వర్క్ ఆర్డర్లు క్లోజ్ చేయాల్సి ఉంది. అయితే అవి పెండింగులోనే ఉండడంతో మే నుంచి వారికి జీతాలు చెల్లించకుండా ఆ మొత్తం రికవరీ చేయాలని, అవసరమైతే మిగిలిన అధికారుల జీతాల నుంచి కూడా రికవరీ చేయాలని ఆదేశాలు అందాయి.

వర్క్‌ఆర్డర్లు అంటే..

ట్రాన్స్‌కో పరిధిలో ఎటువంటి పనిచేయాలన్నా అందుకు అవసరమైన విద్యుత్ పరికరాలను తెలుపుతూ అంచనా ఆర్డర్‌ను తయారు చేస్తారు. వాటిని డీఈ, ఈఈలు ఆమోదించిన తరువాత జిల్లా స్టోర్స్‌కు ఆ వర్క్‌ఆర్డర్లు పంపించి పరికరాలను తీసుకుంటారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ స్తంభాలు నాటడం, సర్వీసు ఇవ్వడం, లైన్‌లాగడం, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు తదితర పనులు చేస్తున్నారు. పని అయ్యాక అందుకు వాడిన మెటీరియల్స్, మిగిలినవి లెక్క చూపుతూ వర్క్‌ఆర్డర్‌ను క్లోజ్ చేయాల్సి ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో మెటీరియల్స్ డ్రా చేశాక వినియోగదారుడి పరంగా భూ సమస్య, కోర్టు కేసులు తదితర అంశాలతో ఆ మెటీరియల్‌ను మరో పనికి వాడుకున్నారు. జిల్లాలో మొత్తం దాదాపు 90 మంది వరకు ఏఈలు ఉండగా అందులో 40 మంది ఏఈలు రూ.160 కోట్లు విలువైన 21,060 వర్క్‌ఆర్డర్లను క్లోజ్ చేయాల్సి ఉంది.

అకౌంటబులిటీ కోసం

ట్రాన్స్‌కో పరిధిలో క్షేత్రస్థాయిలో పనులు చేయాలంటే ఆ శాఖకు సంబంధించి జిల్లా స్టోర్స్‌లో మెటీరియల్స్ కోసం వర్క్‌ఆర్డర్లు పెట్టి డ్రా చేసుకోవాలి. అలా చేసుకున్నా వాటిని వినియోగించిన తరువాత ఆ వివరాలు చూపుతూ వర్క్‌ఆర్డర్‌ను క్లోజ్ చేయాలి. పలు కారణాలతో ఏఈలు ఈ పనులు పెండింగ్‌లో ఉంచారు. ఇందులో 10 మందికి పదోన్నతి, బదిలీల్లో భాగంగా విజయవాడ, తిరుపతి, అనంతపురం, కడప, జిల్లాలోని ఇతర డివిజన్లకు బదిలీ అయ్యారు. అధికారులు బదిలీ అయిన, పదోన్నతిపై వచ్చిన వారి పరిధిలో పెండింగ్‌లో ఉన్న వర్క్‌ఆర్డర్లను క్లోజ్ చేయాల్సి ఉంది.

ఆ తదుపరి ఉన్నతాధికారులు

ఏఈలు వర్క్‌ఆర్డర్లు క్లోజ్ చేయాలని పలుమార్లు జిల్లా అధికారులు హెచ్చరించినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో వారి జీతాల నుంచి రికవరీ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. జీతాల నుంచి రికవరీ ఆలస్యమైతే జేఎంఓ, ఏఓ, డీఈ, ఈఈల జీతాల నుంచి కూడా రికవరీ చేయనున్నారు. ఏఈల జీతాల రూ.60 వేల నుంచి రూ.3 లక్షల వరకు ఉన్నాయి. పలుమార్లు చెప్పినా ఏఈల తీరుమారులేదని, అందుకే జీతాల నుంచి రికవరీకి పూనుకున్నామని అవసరమైతే మిగిలిన అధికారుల జీతాల నుంచి రికవరీ చేస్తామని ఎస్‌ఈ కృష్ణారెడ్డి వివరించారు.

నూతన సబ్ డివిజన్ల ఏర్పాటు

తిరుపతి క్రైమ్: పరిపాలనా సౌలభ్యం, శాంతిభద్రతల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ద్వారా తిరుపతి జిల్లాలో పలు మార్పులు చేసినట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరుపతి అర్బన్, రూరల్ ప్రాంతంలోని పోలీస్ స్టేషన్‌లలో మార్పులు చేసినట్లు తెలిపారు.

తిరుపతి వెస్ట్ సబ్ డివిజన్‌ను చంద్రగిరి సబ్ డివిజన్‌గా మార్పు

కొత్తగా ఏర్పడిన చంద్రగిరి సబ్ డివిజన్‌లోకి ఏడు పోలీస్ స్టేషన్లు చేరాయి. ఇందులో తిరుపతి రూరల్, (గతంలో ముత్యాలరెడ్డిపల్లి), తిరుచానూరు, చంద్రగిరి, రామచంద్రాపురం, పాకాల, ఎర్రావారిపాళెం, భాకరాపేట పోలీస్ స్టేషన్లను చేర్చారు. గతంలో తిరుపతి ఈస్ట్ సబ్ డివిజన్ లో ఉండిన తిరుచానూరు పోలీస్ స్టేషన్‌ని కొత్తగా ఏర్పడిన చంద్రగిరి సబ్ డివిజన్‌లోనికి చేర్చారు. ఇదివరకు ఉన్న ముత్యాలరెడ్డి పల్లి పోలీస్ స్టేషన్‌ను తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ గా మార్పు చేశారు.

తిరుపతి ఈస్ట్ సబ్ డివిజన్‌ను తిరుపతి సబ్ డివిజన్‌గా మార్పు

కొత్తగా ఏర్పడిన తిరుపతి సబ్ డివిజన్‌లోకి తిరుపతి ఈస్ట్, అలిపిరి, వెస్ట్, శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ పోలీస్ స్టేషన్లు చేరాయి. గతంలో తిరుపతి వెస్ట్ సబ్ డివిజన్‌లో ఉన్న తిరుపతి వెస్ట్, ఎస్వీ యూనివర్సిటి పోలీస్ స్టేషన్‌లను ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన తిరుపతి సబ్ డివిజన్‌లోనికి మార్పు చేశారు. అదనపు ఎస్పీలు కులశేఖర్, శాంతి భద్రతల డీఎస్పీలు సురేంద్రరెడ్డి, యశ్వంత్, సీఐలు సురేంద్రరెడ్డి, రవీంద్రనాథ్, సుబ్రమణ్యంరెడ్డి, అబ్బన్న పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణం


విశేషాలంకరణలో స్వామి,అమ్మవార్లు

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చే మూడో శనివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. రాత్రి 7 గంటలకు ఊంజల్‌సేవ నిర్వహించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


పార్టీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: శ్రీకాళహస్తి మండలం, టీఎంవీ కండ్రిగకు చెందిన టీడీపీ కార్యకర్తలు శనివారం శ్రీకాళహస్తి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీఎంవీ కండ్రిగకు చెందిన టీడీపీ కార్యకర్తలు మునిశేఖర్‌రెడ్డి, గంగిరెడ్డి, వంశీ, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వడ్లతాంగల్ బాలాజీప్రసాద్‌రెడ్డి, మునిరామిరెడ్డి పాల్గొన్నారు.

ఎత్తుకు పైఎత్తు!

- హోరాహోరీగా చెస్ టోర్నీ


క్రీడాకారుల ఆటతీరును పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ, చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్

తిరుపతి కల్చరల్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పిడే రేటింగ్ చెస్‌టోర్నమెంట్ రెండో రోజైన శనివారం పోటాపోటీగా సాగింది. క్రీడాకారులు ఎత్తుకు పైఎత్తు వేస్తూ దూసుకుపోయారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి అర్బన్ ఎస్పీ పీ.పరమేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. వీరికి ఆంధ్రా చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్ దివాకర్‌రెడ్డి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఎన్‌టీఆర్ జిల్లాకు చెందిన వజ్రకేఎస్‌ఆర్‌ఈయాతో స్నేహపూర్వకంగా మ్యాచ్ ఆడారు. అలాగే తిరుపతి జిల్లాకు అంతర్జాతీయ పతకాలు తెచ్చిన త్రిపురాంబిక సోదరీమణులతో ఆత్మీయంగా ముచ్చటించారు. తిరుపతి పోలీస్ శాఖ సహకారంతో తిరపుతి జిల్లా చెస్ అసోసియేషన్ జ్యూమ్ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ తెలపడంతో ఎస్పీ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఆంధ్రా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీవీ.శర్మ, కార్యదర్శి భీమారావు, కోశాధికారి జ్వాలాముఖి, తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాససూరి, టీడీసీపీ పరిపాలనాధికారి బాలాజీ, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల సభ్యులు పాల్గొన్నారు.

రౌండ్ 3 తర్వాత కీలక ఫలితాలు

టాప్ సీడ్ వై.గృహేష్ (ఈజీ జిల్లా) అనకాపల్లికి చెందిన మిడిల్ ధనుష్ (1463)తో డ్రాగా ముగిసింది. రెండో బోర్డులో శ్రీకాకుళంకు చెందిన సేతుమాధవ్ (1960)ను వెనక్కి నెట్టి అందాల హేమల్ (144), ఎన్‌టీఆర్ జిల్లాకు చెందిన రేవు వజ్రాక్షులు మూడో రౌండ్ గుణశేఖర్ (1202)తో డ్రాగా ముగిసింది. మూడో రౌండ్ తర్వాత వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు 3 పాయింట్లతో ముందంజలో ఉన్నారు. ఇంకా ఐదు రౌండ్లు మిగిలి ఉన్నాయి.